కొండంత గుండె

మల్లాది వెంకటకృష్ణమూర్తి

మళ్ళీ నవ్వింది ఆ అమ్మాయి కాశీనాథ్ కళ్ళలోకి చూస్తూ.

కాశీనాథ్ బదులుగా నవ్వలేదు. ఆలోచనగా చూసాడు ఆ అమ్మాయి వంక. దాదాపు పది నిముషాలుగా బస్సు కోసం నిలబడివున్నాడు కాశీనాథ్. అయిదు నిమిషాల క్రితం వచ్చింది ఆ అమ్మాయి.

రాత్రి పదిన్నరవుతోంది కాబట్టి చార్‌మినార్ చౌరస్తాలోని ఆ బస్‌స్టాప్ నిర్మానుష్యంగా వుంది. ఆ అమ్మాయి వచ్చిన అయిదు నిమిషాల్లో అరడజను సార్లు యిలా నవ్వింది కాశీనాథ్ వంక చూసి.

కాశీనాథ్‌కి ఆ అమ్మాయిని ఎక్కడా ఇదివరకు చూసిన గుర్తులేదు.

దగ్గరకు వచ్చి అడిగింది ఆ అమ్మాయి.

"టైమెంతయింది?"

"వాచీలేదు నా దగ్గర. పదిన్నర అవుతుండొచ్చు." చెప్పాడు కాశీనాథ్.

"మీరు ఎటు వెళ్ళేది?" అడిగింది.

"రాంనగర్ గుండు."

"నేనూ అక్కడికే."

కాశీనాథ్ మౌనంగా ఉండిపోయాడు.

"బస్సు వస్తుందో, రాదో" తనలో తను అనుకున్నట్లుగా మెల్లిగా అన్నది ఆ అమ్మాయి.

కాశీనాథ్ బస్సుకోసం ఎదురుచూడసాగాడు.

"రిక్షాలో వెళదామా?"

కొన్ని క్షణాల మౌనాన్ని భగ్నం

చేస్తూ హఠాత్తుగా అడిగింది ఆ అమ్మాయి సుతారంగా.

కాశీనాథ్ ఈసారి తేరిపార చూసాడు ఆమె మొహంలోకి.

"మీ దగ్గర ఓ యాభై రూపాయ లున్నాయా ?" రహస్యంగా అడుగుతు న్నట్లుగా అడిగింది మెల్లిగా.

"దేనికీ ."

"మీకు తెలీదా ?"

గలగలా నవ్వింది.

కాశీనాథ్ మాట్లాడలేదు.

"సెకండ్ షో సినిమా విడిచిపెట్టే టైందాకా వుంటాను. మీరు బ్రహ్మ చారేనా ?"

"అవును."

"రామ్‌నగర్‌లో గది తీసుకుని వుంటున్నారా ?"

"అవును."

"నేనుండేది విద్యానగర్. రమ్మంటే వస్తాను లేకపోతే రిక్షాఎక్కి విద్యానగర్ వెళ్ళిపోతాను."

"వెళ్ళండి."

"మీ దగ్గర అంత లేదా, పోనీ నలభై ..."

"వద్దు. వెళ్ళండి."

నిరాశ తళుక్కుమంది ఆమె మొహంలో

రిక్షాలు ఆగివున్న చోటికి నడవ సాగింది ఆమె మెల్లిగా. మధ్యలో రెండుసార్లు వెనక్కి తిరిగి చూసింది కాశీనాథ్ వంక.

కాశీనాథ్ నరాల్లో, రక్తనాళాల్లో కద లిక ప్రారంభం అయింది. ఈ చలిరాత్రి తన ప్రక్కలో ఆమె వెచ్చటి వళ్ళు....

తటపటాయించి గబగబా ఆమెవైపు అడుగులు వేసాడు.

"మాట." పిల్చాడు నడుస్తూ.

ఆమె మీటనొక్కిన బొమ్మలా వెనక్కి తిరిగి మళ్ళీ నవ్వింది అందంగా.

"ఏమిటి ?" అడిగింది.

"ముప్పై వున్నాయి."

"ఇంకో అయిదున్నాయేమో చూడండి."

"లేవు."

"అయితే పాతికివ్వండి. ఓ గంట వుండి వెళ్ళిపోతాను."

"ఇందాక చాలా సేపు వుంటా నన్నారు :"

మళ్ళీ గలగలా నవ్వింది.

"రిక్షా మాట్లాడండయితే."

"బస్సు వచ్చేస్తుంది."

"నే నిస్తాలెండి రిక్షా డబ్బులు."

మళ్ళీ గలగలా నవ్వింది.

రిక్షా మాట్లాడాడు కాశీనాథ్ ఇద్దరికీ. టాపు వేసిన ఇరుకు రిక్షాలో బయల్దేరారు.

"నా పేరు కాశీనాథ్." చెప్పాడు.

ఆమె మాట్లాడలేదు.

జేబులోంచి సిగరెట్ పెట్టె, అగ్గి పెట్టె తీస్తూ అడిగాడు.

"తాగొచ్చా?"

"తప్పనిసరి అనుకుంటే తాగచ్చు. ఫర్వాలేదు."

కాశీనాథ్ సిగరెట్ కాల్చకుండా మళ్ళీ రెండింటినీ జేబులోకి తోసేసాడు.

గతుకుల రోడ్లో ఆమెవళ్ళు మెత్తగా తగులుతోంది కాశీనాథ్‌కి.

"ఇక్కడ దిగిపోదాం." అన్నది రిక్షా రామ్‌నగర్ గుండు చేరగానే."

కాశీనాథ్ రిక్షా ఓగి తనే డబ్బులిచ్చేశాడు రిక్షావాడికి.

నాలుగు నిమిషాల్లో ఓ పెద్దయింటి గేటు తెరిచి లోపలికి వెళ్ళాడు కాశీనాథ్. ఆ అమ్మాయి కాశీనాథ్ వెంట నడిచింది.

ఎదురుగా మూడంతస్థుల పెద్దమేడ. ఆమేడ ప్రక్కనుంచి, క్రోటన్‌మొక్కల మధ్యలో వెనకవైపుకి చిన్న కాలిబాట.

ఆ మేడ వెనకాల పెద్ద ఖాళీస్థలం. స్థలంనిండా రకరకాల మొక్కలు, చెట్లు. ఓ మూలగా విసిరేసినట్లుగా వుందో చిన్న గది.

కాశీనాథ్ జేబులోంచి తాళంచెవి తీసి ఆ గది తలుపు తెరిచాడు. బయటే నిలబడింది ఆ అమ్మాయి.

గది లోపల చీకటి.

ఓ నిమిషం తర్వాత అగ్గిపెట్టె గీసిన చప్పుడు. గదంతా మందమయిన వెలుగుతో నిండింది.

"రండి."

పిల్చాడు కాశీనాథ్. ఆ అమ్మాయి లోపలికి రాగానే గది తలుపులు మూసి లోపల గడియపెట్టాడు.

ఆ గదివంక పరిశీలనగా చూసింది ఆ అమ్మాయి. చేతులు రెండూ పైకెత్తితే తగిలేంత ఎత్తులోవున్న ఏస్‌బెస్టాస్ రేకులు ఆ గది కప్పు. ఓ ప్లాస్టిక్ బకెట్, ఓ ఇనప బకెట్, చిన్న స్టవ్. ఓ మూల ఖాళీ బీర్‌బాటిల్‌లో సగందాకా వున్న కిరసనాయిలు, రెండు చాపలు. ఒకటి నేలమీద పరచబడి వుంది. పైన మాసిపోయిన దుప్పటి, దిండు. పుస్తకాలు కొన్ని అడ్డదిడ్డంగా పడివున్నాయి. ఓ మూలగా హేమామాలిని కాలండర్ ఒకటి, దాని ప్రక్కనే అద్దం పగిలిన ఓ ఫోటో వేలాడుతున్నాయి. కిటికీకూడా లేదు ఆ గదికి.

"ఇదే నా గది" కొద్దిగా ఇబ్బందిగా అన్నాడు కాశీనాథ్.

చాపమీద దుప్పటిని సరిచేసి దానిమీద కూర్చుంది ఆ అమ్మాయి.

"ఎవరూ రారా?" అడిగింది కాశీనాథ్ లాంతరు వత్తిని తగ్గిస్తుంటే.

"ఉహూ. నేనొక్కడ్నే వుంటున్నాను."

"ఎంత దీనికి అద్దె?" అడిగింది.

"ముప్పై."

"చవకే."

కాశీనాథ్ నవ్వాడు. అతను కూర్చోటానికి ప్రక్కకు జరిగింది ఆమె

కూర్చున్నాక కాశీనాథ్ భుజంమీద చేతులువేసి బుగ్గమీద ముద్దుపెట్టుకుంది.

"గడ్డం గీసి ఎన్నాళ్ళయింది?" నవ్వుతూ అడిగింది.

కాశీనాథ్ వెంటనే లేచాడు. మళ్ళీ లాంతరు వత్తి పెద్దదిచేసి గడ్డంసామాను బయటకుతీసి పది నిమిషాల్లో గడ్డం గీసుకున్నాడు.

నవ్వుతూ చూస్తూండిపోయింది ఆ అమ్మాయి కాశీనాథ్ వంక.

కాశీనాథ్ జేబులోంచి మూడు పది రూపాయల నోట్లు తీసి అందించాడు ఆ అమ్మాయికి.

ఆ అమ్మాయి జాకెట్‌లోంచి చిన్న పుసీపర్సుని బయటికితీసి ఆ డబ్బు పర్సులో పుంచుకుని దాన్ని దిండుక్రింద వుంచి లాంతరు వత్తి తగ్గించింది.

"మీ పేరు?" అడిగాడు ప్రక్కన కూర్చుంటూ.

"మీకే పేరు ఇష్టం?" అడిగింది వెంటనే.

"ఏం?"

"ఆ పేరుతో పిలవండి."

"అలా వద్దు. మీపేరు చెప్పండి."

"ప్రణయశీల."

"ప్రణయశీలా?"

"అవును."

"గమ్మత్తుగా వుంది. ఇది మీ వాళ్ళు పెట్టిన పేరా లేక మీరు మధ్యలో మార్చుకున్నారా?"

జవాబుగా గలగల నవ్వింది.

కాశీనాథ్ రెండుభుజాలమీద చేతులు వేసి మీదకి లాక్కుంది. కాశీనాథ్ పెదవులని తన పెదవుల మధ్యవుంచుకొంది. గుండె వేగంగా కొట్టుకుంటుంటే, కాశీనాథ్ కళ్ళు మూసుకుని ప్రణయశీలని చుట్టుకుపోయాడు.

పావుగంట తర్వాత ప్రణయశీల లాంతరు వత్తిని పెద్దది చేసింది.

"బనీను వృత్తికి ఎంతకాలమయింది?" అడిగింది కాశీనాథ్ తొడుక్కున్న బనీను విప్పుతూ.

కాశీనాథ్ సిగ్గుపడటం స్పష్టంగా గమనించింది ప్రణయశీల.

"ఏం చేస్తున్నారు?" అడిగింది లేచి కూర్చుని.

"ఉద్యోగంకోసం వెతుకుతున్నాను."

కాశీనాథ్ తలని ప్రణయశీల తన వళ్ళోకి లాక్కుంది.

"ఆ ఫోటోలో వాళ్ళెవరు?" అడిగింది.

"మా అమ్మా, నేను, తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు, అక్కయ్య."

"ఎక్కడ వుంటారు?"

"బాపట్ల."

కాశీనాథ్ జుట్టుని చేతితో నిమురుతూ యాంత్రికంగా అడిగింది.

"ఏం చదివారు?"

"బి.ఏ."

"బండబ్బాయి అన్నమాట."

"అంటే ?"

గలగల నవ్వింది ప్రణయశీల.

"నేను బి.ఏ. చదివే రోజుల్లో మా లెక్చరర్ అనేవాడు. బి.ఏ. అంటే బండమ్మాయి. ఎం.ఏ. అంటే మొద్ద మ్మాయి అని."

"మీరు 'మొద్దమ్మాయి' దాకా చదివారా ?"

"ఉహు. బండమ్మాయికూడా పూర్తి చేయలేకపోయాను."

కాశీనాథ్, ప్రణయశీల చాలాసేపు మౌనంగా ఉండిపోయారు.

"మరి ఎలా గడుస్తోంది ఉద్యోగం లేకపోతే ?" అడిగింది.

"వారంనుంచి ఆటో నడుపుతున్నాను అద్దెకు తీసుకొని. ఇందాక మీరు చూసిన మేడాయన-ఈ ఇంటి యజమానికి ఆటోలున్నాయి."

"ఇంకో ఇరవై వుంటే ఇవ్వరాదా ? తెల్లారేదాకా వుండిపోతాను."

"లేవు. నా కిదే మొదటిసారి. ఉంటే తప్పకుండా ఇచ్చేవాణ్ణి."

కాశీనాథ్‌ని దుప్పటీమీదకి సరిగా లాగి ప్రణయశీల తనే కాశీనాథ్‌ని ఆక్రమించుకోసాగింది. కాశీనాథ్ చేతులు ప్రణయశీల వీపుని చుట్టేశాయి.

* * *

ప్రణయశీల కాశీనాథ్ వంకచూసింది. గాఢనిద్రలో వున్నట్లుగా అతనిముఖమే చెప్తోంది. అతని చేతిని తన భుజాలమీద నుంచి తీసి నిశ్శబ్దంగా లేచింది.

లాంతరు వత్తిని పెద్దది చేసింది. చీర కట్టుకొని, ఆ గదివంక చూసింది. ఫైంపీస్, వాచ్, ట్రాన్సిస్టర్ లాంటి విలువయిన చేత్తో పట్టుకెళ్ళగలిగిన వస్తువుల కోసం వెతుకుతున్నాయి ఆమె కళ్ళు.

బోసిగా వెలవెలబోతోంది ఆ గది. ఎక్కడ చూచినా పేదరికపు ఛాయలు.

తాడుతో కట్టిన దండేనికి వేలాడుతున్నాయి రెండు జతల బట్టలు. గబగబా వాటి జేబులు వెతికింది. ఖాళీగా ఉన్నాయ్. అన్నీ కాటన్ బట్టలే.

చాప ప్రక్కన పడివున్న, కాశీనాథ్ వంటిమీదినుంచి విప్పిన చొక్కా, పేంట్లని వంగి చేతిలోకి తీసుకొని జేబులలో చేతులుంచి తనిఖీ చేసింది.

గలగలమంటూ కొంత చిల్లర నేలమీదపడి గది మూలకి జారిపోయింది. ఉలిక్కిపడి చూసింది కాశీనాథ్ వంక.

మెలకువ రాలేదు. ఆదమరచి నిద్రపోతున్నాడు.

పేంట్ జేబు బేక్‌పాకెట్‌లో ఏదో కాగితం తగిలింది.

వంద రూపాయిల నోటు అయి వుండచ్చని బయటకి తీసింది ఆత్రంగా.

డబ్బుకాదు.

ఇన్‌లాండ్ లెటర్. మడతలు విప్పింది.

అదో ఉత్తరం. ఆ కాగితంమీది వాక్యాలవెంట పరిగెత్తాయి ఆమెకళ్ళు. తెలుగులో వ్రాసివుంది.



-కాశీ అన్నయ్యకు నీ చిన్నచెల్లెలు నమస్కరించి వ్రాయునది,

విసుగ్గా దాన్ని మళ్ళీ జేబులో పెట్టబోయింది కాని ఉత్తరం మధ్యలోని ఓ మాట ప్రణయశీల దృష్టిలో పడింది

ఆ మాట డబ్బు

మళ్ళీ చదవసాగింది ఉత్తరం

వ్రాయునది,

అమ్మకు ఎక్కువయింది శానిటోరియంలో చేర్పించాలని అంటున్నారు అంతా దగ్గు విపరీతంగా ఎక్కువయింది ఇప్పుడు పెద్దక్కకూడా దగ్గుతోంది అనుమానంగా వుంది నాకు చిన్నన్నయ్యని పనిలోంచి తీసేసారు స్పేర్ పార్ట్స్ పోతే వాడు నేను తీయలేదు, నాకేం తెలియదంటున్నాడు బట్టలు చిరిగిపోయాయి అందరికీ , వీలుంటే డబ్బు పంపు అత్తయ్య కూతురికి మొగపిల్లాడుట చిన్నక్క మొన్నరాత్రి ఆలస్యంగా వచ్చింది ఇంటికి అమ్మ చి వా ట్లు పెట్టింది డబ్బు తప్పక పంపు,ఉద్యోగం వచ్చింది కనుక ఏం ఉద్యోగమోరాయలేదే, మా అన్నయ్యకి ఉద్యోగం వచ్చిందంటే "ఏం ఉద్యోగం" అని అడుగుతున్నారు అంతా

నమస్కారాలతో నీ చెల్లెలు

ఉత్తరం మడిచి మళ్ళీ ఆ కాకీరంగు పేంట్ బేక్‌పాకెట్‌లో వుంచింది దాన్ని

తలుపు తెరచి బయిటకువెళ్ళి నిలబడింది కాస్సేపు రెండడుగులుముందుకు వేసింది కాని వెళ్ళబుద్ధిగాలేదు ప్రణయశీలకు

మళ్ళీ లోపలికివచ్చి జాకెట్‌లోంచి పర్స్‌తీసి, పర్స్‌లోంచి ఇందాక కాశీనాథ్

ఇచ్చిన ముప్పై రూపాయలు బయటికి తీసి అతని పేంట్ జేబులో పెట్టింది.

చిన్నగా నిట్టూర్చి మళ్ళీ బయటకు నడిచింది. అయినా అడుగు పడలేదు.

మళ్ళీ లోపలికి వచ్చింది.

పర్స్ తెరిచి దాంట్లోంచి నలభై రూపాయలు తీసి పేంట్ జేబులో వుంచింది.

మళ్ళీ బయటికి నడిచింది.

ఈసారి కూడా అడుగులు పడలేదు.

ఇంకోసారి లోపలికి వచ్చింది.

పర్స్ తెరచింది మళ్ళీ.

పేంట్ జేబులో తను వుంచిన నలభై లోంచి ఇరవై తీసి మళ్ళీ పర్స్‌లో వుంచుకుంది. గుమ్మందగ్గరికి వెళ్ళి వెనక్కి తిరిగి చూసింది నిద్రపోతున్న కాశీనాథ్ వంక. నిద్రలో శ్వాసకి ఆచ్ఛాదనలేని ఛాతీ ఎగిరెగిరి పడుతోంది.

ఓసారి ఆ గదివంక చూసింది.

హేమామాలిని కాలండం ప్రక్కన వేలాడుతున్న ఫోటో దగ్గరికి వెళ్ళింది. లాంతరు ఎత్తిపట్టి కొన్ని క్షణాలు తదేక దీక్షగా చూసింది ఆ ఫోటోలోని మనుషుల వంక.

తర్వాత కాశీనాథ్ దగ్గరికి వెళ్ళింది, లాంతరు పక్కన పెట్టి.

తన కిష్టంలేదని సిగరెట్ కాల్చలేదు; తనకు గుచ్చుకుంటుందని గడ్డం గీసుకున్నాడు !!

కాశీనాథ్ మొహంలోకి కొన్ని క్షణాలు చూస్తూండిపోయింది.

"నా కిదే మొదటిసారి" అన్న కాశీనాథ్ మాటలు గుర్తుకువచ్చాయి.

వంగి ప్రక్కన పడివున్న మాసిన లుంగీని అతని వంటిమీద కప్పింది ప్రణయశీల.

తర్వాత తృప్తిగా బయటకి నడిచి, తలుపులు దగ్గరికి నొక్కి, వడివడిగా చీకట్లో కలిసిపోయింది.